క్లుప్తంగా

'అమనగంటి' సేవలు చిరస్మరణీయం



శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎన్జీఓ నాయకులు

కడప రూరల్ : ఏపీ ఎన్జీఓ సంఘం వ్యవస్థాపకులు కామ్రేడ్ అమనగంటి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు అన్నారు. శ్రీరాములు జయంతి సందర్భంగా సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీరాములు జీవిత కాలమంతా ఉద్యోగుల హక్కుల కోసం పోరాడిన మహనీయుడని అన్నారు. ఉద్యోగులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, నిత్యపూజయ్య, టీ తిమ్మారెడ్డి, బాల పుల్లయ్య, నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరం



చలివేంద్రం ప్రారంభిస్తున్న జేబీవీఎస్ సేవా సమితి నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : వేసవి కాలంలో చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరమని జేబీవీఎస్ ప్రిజర్వేర్ సేవా సమితి వ్యవస్థాపకుడు అశోక్ అన్నారు. కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు గంగరాజు, కాశీ, సుమంత్, చరణ్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వీరపునాయునిపల్లి: వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి పాలగిరి క్రాస్ వద్ద వెలసిన షిర్డీసాయిబాబా ఆలయ 3వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయంలోని మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో సాయివ్రతాలు చేపట్టాలరు. ఈ వ్రతాల్లో మహిళలతో పాలు పురుషులు పాల్గొన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తాళాల భజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకొంది. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'బ్రౌన్'కు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక స్థానం



తాళపత్రాలను పరిశీలిస్తున్న నెడ్‌క్యాప్ అధికారి యల్లారెడ్డి

కడప కల్చరల్ : రాష్ట్రంలో సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయానికి ప్రత్యేకత స్థానం ఉందని కడప నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ టి.యల్లారెడ్డి తెలిపారు. సోమవారం బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహా మండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణ రావు ఈ సందర్భంగా బ్రౌన్ సేవలను, గ్రంథాలయ నిర్మాణం, నిర్వహణకు జానమద్ది హనుమచ్ఛాస్త్రి చేసిన కృషిని వివరించారు. పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలను, తామ్రపత్రాన్ని, చేతితో తయారు చేసిన కాగితాలను చూసి యల్లారెడ్డి హర్షం, ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నిర్వహణ విధానాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది హరి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

కమలాపురం: ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని మసీదుల వద్ద పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని అన్ని మసీదుల వద్ద ఆయన పర్యటించారు. ప్రతిరోజు తప్పనిసరిగా అన్ని మసీదుల వద్ద శానిటేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, శానిటరీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు

– ఇరువురికి గాయాలు

లింగాల : లింగాల మండలం పార్నపల్లె గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి ఒక కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న తురకవానిపల్లె గ్రామానికి చెందిన రమేష్, పార్నపల్లెకు చెందిన సులోచన గాయపడ్డారు. వారిని వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. రమేష్‌కు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

పొంచి ఉన్న మంచినీటి ముప్పు

- ఎండిపోతున్న పెన్నా నది
- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- కడప నగరంలో మొదలైన దాహం కేకలు



కాలనీలకు సరఫరా చేయడానికి పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ట్యాంకర్‌కు నీటిని పడుతున్న దృశ్యం



సైకిల్‌పై బిందెలతో నీటిని తీసుకెళ్తున్న వ్యక్తి



గౌస్ నగర్‌లో కుళాయి ద్వారా వస్తున్న కలుషిత నీరు

కడప కార్పొరేషన్ : జిల్లా కేంద్రమైన కడపకు మంచినీటి ముప్పు పొంచి ఉంది. కడప నగరానికి ప్రధాన వనరు అయిన పెన్నానది ఎండిపోయే పరిస్థితికి వచ్చింది. ఎండలు మండిపోతుండటం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఇవే ఎండలు, వడగాల్పులు కొనసాగితే పెన్నానదిలోని నీరు పూర్తిగా ఇంకిపోయేందుకు 20 రోజులు కూడా పట్టే అవకాశం లేదు. పెన్నానది పూర్తిగా ఎండిపోక ముందే మేల్కొక పోతే ఏప్రిల్‌లో తీవ్ర నీటి ఎద్దడి తప్పేలా లేదు. లింగంపల్లి వాటర్ వర్క్స్, గండి వాటర్ వర్క్స్‌ల ద్వారా నుంచే ప్రధానంగా కడపకు తాగునీరు సరఫరా అవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 3.44 లక్షల మంది జనాభా ఉండగా, ప్రస్తుత లెక్కల ప్రకారం 4.32 లక్షల మంది ఉన్నట్లు అంచనా. వీరికి సరిపడా తాగునీటిని సరఫరా చేయాలంటే 57.1 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్స్ పర్ డే) అవసరం కాగా, 47.2 ఎంఎల్‌డీల నీరు సరఫరా చేస్తున్నారు. 9.9 ఎంఎల్‌డీల నీరు మాత్రమే కొరత ఉంది. కడపలో ఉన్న 200లకు పైగా ఉన్న మురికివాడలకు రోజు మార్చి రోజు నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతల్లో మాత్రమే నీరు ప్రతి రోజూ సరఫరా అవుతోంది. మినీ బైపాస్ పక్కన ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు పోయే మార్గంలో చంద్రమౌళి నగర్, గంజికుంట కాలనీ, శంకరాపురంలో తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో నగరపాలక సంస్థ అధికారులు రెండు ట్యాంకర్ల ద్వారా ఆయా ప్రాంతాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ఎద్దడి మరికొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశాలు ఉన్నాయి. ఇలా నీటి ఎద్దడి రాకుండా ఉండాలంటే మైలవరం నుంచి పెన్నానదికి నీటిని విడుదల చేయించడం ఒక్కటే మార్గంగా కనిపిస్తోంది.

సబ్ సర్ఫేజ్ డ్యామ్ అని ఊరించి... ఉసూరుమనిపించి

కడప నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సుమారు రూ.700 కోట్లతో సోమశిల బ్యాక్ వాటర్ స్కీం తెచ్చారు. ఆయన అకాల మరణం తర్వాత సమస్యలు తలెత్తాయి. సోమశిల నీటిని తరలించవద్దని టీడీపీ నేత సోమరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆందోళన చేపట్టడంతో అనాటి రోశయ్య ప్రభుత్వం ఈ స్కీంను పక్కన బెట్టింది. ఆ తర్వాత 2014–19 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం లింగంపల్లి వద్ద రూ.72 కోట్లతో సబ్ సర్ఫేజ్ డ్యామ్ నిర్మించాలని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో శంకుస్థాపన చేయించారు. కానీ ఆ ప్రక్రియ టెండర్ల దశకు కూడా చేరుకోలేదు. 2019–24 వరకూ అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడప తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి బ్రహ్మంసాగర్‌లో కడపకు 1.5 టీఎంసీల నికర జలాలను కేటాయించి, రూ.540 కోట్లతో గ్రావిటీ ద్వారా పైపులైన్ తీసుకు రావడానికి టెండర్లు పిలిచారు. ఎన్నికలు రావడంతో ఆ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పుడు అధికారంలో కూటమి ప్రభుత్వం ఈ పనులను పూర్తి చేయించి ప్రజల్లో మంచిపేరు తెచ్చుకుంటుందా... వైఎస్సార్‌సీపీకి మంచిపేరు వస్తుందని ఆ పనులను నిలిపేసి కడపపై అక్కసు ప్రదర్శిస్తుందా వేచి చూడాలి.

- కడప నగరంలో 27 సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు ఉండగా, 59600 కుళాయిలు ఉన్నాయి. వీటి సామర్థ్యం 21.20 ఎంఎల్‌డీలుగా ఉంది. 96 కి.మీల మేర పంపింగ్ మైన్ ఉండగా, 555 కి.మీ పైపులైన్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విస్తరించి ఉంది.

మురికినీటితో ఇబ్బంది పడుతున్నాం

కడప నగరంలోని 27వ డివిజన్ గౌస్ నగర్‌లో రెండు, మూడు రోజులకొకసారి నీరు వస్తున్నాయి. కుళాయిల్లో మురికిగా దుర్వాసనతో నీరు వస్తున్నది. దీన్ని ఎలా వాడాలో, ఎలా తాగాలో అర్థం కావడం లేదు. బట్టలు ఉతికేందుకు కూడా ఈ నీరు పనికిరావు. ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– పి.ఖాదర్‌బాషా, గౌస్ నగర్

చర్యలు తీసుకుంటున్నాం

కడపలో తాగునీటి సమస్యలు రాకుండా అన్ని రకాలైన చర్యలు తీసుకుంటున్నాం. గండి, లింగంపల్లి వాటర్ వర్క్స్‌ల వద్ద నీటిని నిల్వ చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికైతే ఒకట్రెండు కాలనీల్లో మినహా ఎక్కడా నీటి సమస్య లేదు. రోజు మార్చి రోజు నీటిని అందిస్తున్నాం. మురికి నీరు వస్తున్న ప్రాంతాల్లో.. ఎందుకు అలా వస్తుందో తెలుసుకుంటాం. అక్కడ కూడా స్వచ్ఛమైన నీటిని అందిస్తాం.

– చెన్నకేశవరెడ్డి, ఎస్ఈ, నగరపాలక సంస్థ

నేడు రక్తదాన శిబిరం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన యూనివర్సిటీ కళాశాల జాతీయ సేవా పథకం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు, యూనివర్సిటీ ఆఫ్ యోగి ఫౌండేషన్‌తో కలిసి మంగళవారం ఉదయం వైవీయూ ఆరోగ్యకేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు పి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, అకడమిక్ కన్సల్టెంట్స్, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయాలని ఎన్ఎస్ఎస్ వైవీయూ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి కోరారని ఆమె పేర్కొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు జాబితా

వీరపునాయునిపల్లె: రబీ 2024–25కు సంబంధించి రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితా మండలంలోని 15 రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలవ్యాప్తంగా 6,671 మంది రైతులు, 25,410 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారని తెలిపారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు జాబితాల్లో ఉందా లేదా అని చూసుకోవాలని, అంతే కాకుండా ఏవైనా పొరపాట్లు ఉంటే వాటిని గుర్తించి ఈ నెల 12వ తేదీ లోపు రాత పూర్వకంగా సంబంధిత వ్యవసాయ సిబ్బందికి తెలపాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి 22వ తేదీన తుది జాబితాను విడుదల చేయడంతో పాటు గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

వేముల : వేములలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం విద్యార్థులకు అతిథి భోజనం ఏర్పాటు చేశారు. మండలంలోని గొందిపల్లె గ్రామానికి చెందిన కలంకుంట్ల జయచంద్రారెడ్డి, పార్వతమ్మల కుమారుడు కలంకుంట్ల గంగాప్రసాద్‌రెడ్డి 5వ వర్ధంతిని పురస్కరించుకుని 250 మంది విద్యార్థినులకు తిథి భోజనాన్ని అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శారదమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా లోకానికి దిక్సూచి సావిత్రిబాయి పూలే



సావిత్రి బాయికి జోహార్లు అర్పిస్తున్న వివిధ ప్రజా సంఘాల నాయకులు



సావిత్రి బాయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మహిళా లోకానికి దిక్సూచి సావిత్రిబాయి పూలే అని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. నగరంలోని కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఆమె భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరంలోని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ కేంద్ర కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున, వివిధ సంఘాలు, పార్టీల నాయకులు జేవీ రమణ, వైఎం ప్రతాప్‌రెడ్డి, సంగటి మనోహర్, పీవీ రమణ, అమీన్‌పీరా, కైపు రామాంజనేయులు, బండెల ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, పీవైఎల్ జిల్లా కన్వీనర్ ఎస్.షామీవుల్లా, జిల్లా నాయకులు అమీర్, మహేష్, జాకీర్ హుస్సేన్, రెహమాన్, జగదీష్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీడీఎస్‌యూ ప్రాంతీయ కార్యాలయంలో..

- కడప నగరంలోని అఖిల భారత విద్యార్థి సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై ఉక్కుపాదం దారుణం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అంగన్వాడీల ఉద్యమంపై కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపి అణచివేయాలనుకోవడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చలో విజయవాడ మహా ధర్నాకు రైళ్లు, బస్సుల్లో వెళ్తున్న అంగన్వాడీ కార్యకర్తలను ఎక్కడపడితే అక్కడ అర్ధ రాత్రి అపరాత్రి అని తేడా లేకుండా అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. మూడు అంగన్వాడీ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా గత ప్రభుత్వ కాలంలో 42 రోజుల సమ్మెకు.. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మద్దతు తెలిపి గత 11 నెలల కాలంలో అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వకపోయినా తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా అయినా వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.చంద్రశేఖర్, జిల్లా సమితి సభ్యులు సావన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన ‘ప్రజా సమస్యల పరిష్కార వేదిక’ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని సకాలంలో పరిష్కరించాలని అన్ని విభాగాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ ఆర్ఎస్ రోడ్డు, ఇందిరా నగర్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.
- కమిషనర్ ఆదేశాల మేరకు నగరపాలక మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఓంశాంతి నగర్, ప్రకాష్ నగర్, చిన్నమాచుపల్లి ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. మామిళ్లపల్లె, కాగితాలపెంట ప్రాంతాల్లో స్ప్రేయింగ్, విజయదుర్గా కాలనీ, మామిళ్లపల్లె ప్రాంతాల్లో కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు.

రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్ పెంచాలి



నిరసన తెలుపుతున్న రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులకు కనీస పెన్షన్ పెంచాలని రిటైర్డు ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో పెన్షన్ పెంపుపై నిరసనలో భాగంగా సోమవారం కడప ఆర్టీసీ బస్టాండు ఆవరణలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు డీసీ సుబ్బారెడ్డి, రవీంద్రనాథ వర్మ మాట్లాడుతూ ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న యూపీఎఫ్ పెన్షన్‌దారుల కిందికి వస్తారన్నారు. వీరికి నెలకు రూ.1000లు, రూ.1400లు, రూ.2వేలు మాత్రమే పెన్షన్ వస్తోందని, ఒక్క రూపాయి పెన్షన్ పెరగాలన్నా కేంద్ర ప్రభుత్వం పెంచాల్సిందేనని తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రధాన కార్మిక సంఘాలు అన్ని దాదాపు ఏడేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కూడా కనీస పెన్షన్ రూ.7,500 పెంచాలని అనేక ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సామాజిక వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గ ఎమ్మెల్యేలకు మెమోరాండం ఇస్తున్నామని, కనీసం రిటైర్డు అయిన ఉద్యోగికి ఎటువంటి పరిమితులు లేకుండా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. చాలీచాలని పెన్షన్‌తో భార్యాభర్తలిద్దరికీ సరిపోకా చిన్న, చిన్న పనులు చేస్తున్నా చాలక దుర్భర జీవితం గడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో రీజినల్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కోశాధికారి సోమశేఖరరెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలించే కాంట్రాక్టర్‌పై ఉదాసీన వైఖరి

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ పరిధిలో చికెన్ వ్యర్థాలను తరలించే కాంట్రాక్టర్ పట్ల నగరపాలక సంస్థ అధికారులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుజాత అన్నారు. ఆమె సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. సదరు కాంట్రాక్టర్ ఒక ఏడాది కాలపరిమితితో రూ.20 లక్షలకు టెండర్ పాడారని, గత ఆగస్టు నాటికి కాలపరిమితి పూర్తయిందన్నారు. కానీ అతను కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన బకాయి చెల్లించలేదన్నారు. ఇప్పటి వరకూ అతను రూ.32 లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉందన్నారు. టెండర్ పూర్తయి ఏడు నెలలు కావస్తున్నా అధికారులు కొత్తగా టెండర్లు పిలవకుండా అతన్నే కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఈ మొత్తం డబ్బులు కాంట్రాక్టర్ చెల్లిస్తాడా, లేక సంబంధిత అధికారుల వద్ద నుంచి వసూలు చేస్తారా చెప్పాలన్నారు. కార్పొరేషన్ ఆదాయనికి గండి కొడుతున్న టెండర్‌దారునికి అధికారులు వత్తాసు పలుకుతూ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బకాయిలు వసూలు చేయాలని కోరారు.

మంత్రి లోకేష్‌కు స్వాగతం



మంత్రి లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

కడప కోటిరెడ్డి సర్కిల్ : సత్యసాయి జిల్లా కదిరిలోని ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగానే సత్యప్రసాద్ పాల్గొన్నారు. తిరుగు ప్రయాణంలో సోమవారం అర్ధరాత్రి రోడ్డుమార్గంలో కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. వీరికి జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్, డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, టీడీపీ నాయకులు గోవర్దన్ రెడ్డి, హరిప్రసాద్, భూపేష్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

శేషవాహనంపై శ్రీ వేంకటేశ్వరస్వామి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు జరగనున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించి విశ్వక్సేన పూజ, మూలవరులకు రక్షా బంధనము, గరుడ ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి స్వామి వారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ రామలింగారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, శ్రావణ్, ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మార్చి 31 వరకు కేసీ కెనాల్‌కు సాగునీరివ్వాలి

చాపాడు : ఈ నెల చివరి వరకూ కేసీ కెనాల్ ద్వారా ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని కోరుతూ కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మేజర్ ప్రాజెక్ట్ చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి కేసీ కెనాల్ నంద్యాల డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు సోమవారం లేఖ రాశారు. ఈ సందర్భంగా గురివిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని కేసీ కెనాల్‌కు నీరు అవసరం మేరకు అందకపోవడంతో మినుము, పసుపు, వరి, మిరప, వరి, పెసర వంటి పంటలకు కోత దశలో ఇబ్బందులు తలెత్తాయన్నారు. చాపాడు, ఏటూరు, కొండపేట కాలువలతో పాటు కేసీ కెనాల్ ప్రధాన కాలువ పరిధిలోని రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారన్నారు. తాను ఏటూరు కాలువ క్రింద రైతుగా ఉన్నానని, దీని పరిధిలో 7వేల ఎకరాల ఆయకట్టు ఉందని, ఇప్పటికీ 1000 ఎకరాలలో వివిధ రకాల పంటలు సాగులో ఉన్నాయన్నారు.

'యథేచ్ఛగా మురుగు కాలువల ఆక్రమణ'



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ప్రజాపక్షం పార్టీ నాయకులు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో యథేచ్ఛగా మురుగు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ప్రజాపక్షం పార్టీ అధ్యక్షుడు పుత్తా లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. ఆయన ప్రజాపక్షం పార్టీ నాయకులతో కలిసి సోమవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టూటౌన్ బైపాస్ రోడ్డు నుంచి కొత్తపల్లె పంచాయతీలో కలిసే రెండు కాలువలు కబ్జాకు గురయ్యాయన్నారు. సర్వే నంబర్ 568లో మోడంమీదపల్లె ఆంజనేయస్వామి దేవాలయం మీదుగా మురుగు కాలువ ఉందన్నారు. సర్వే నంబర్ 118లోని మురికి కాలువ ఎఫ్‌జీ ఫంక్షన్ హాల్ వరకు 2.10 ఎకరాల విస్తీర్ణంలో ఉందన్నారు. ఈ ఏరియాలో సెంటు స్థలం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు పలుకుతోందన్నారు. అనేక మంది కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం పార్టీ నాయకులు రామ్మోహన్‌రెడ్డి, శివరామిరెడ్డి, ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలించకండి



పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి

కడప కల్చరల్ : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని ప్రస్తుతమున్న చోటే ఉంచాలని, ఎక్కడికి తరలించవద్దని వైఎస్సార్ సీపీ లోక్ సభా పక్ష నేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కు లేఖ రాశారు. రాయలసీమ ఇంటలెక్చువల్స్ ఫోరం, రాయలసీమ అభివృద్ధి వేదిక, సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీల ప్రతినిధులు ఆయనను కలిసి ఈ విషయాన్ని విన్నవించారు. వారి వినతిమేరకు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్రంలో మరో మూడు గ్రామీణ బ్యాంకులతో విలీనం తర్వాత కూడా కడపలో ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించడం న్యాయమన్నారు. రాయలసీమ ప్రాంతంలో పనిచేస్తున్న ఏపీజీబీ మౌలిక వసతులు, రిజర్వులు, ఎక్కువ బ్రాంచ్‌లు, మంచి పనితీరు, దక్షిణ భారతదేశంలోనే క్యాష్ చెస్ట్ సౌకర్యం ఉన్న ఒకే ఒక్క బ్యాంకు అన్నారు. ఇలా ఏ కొలమానంతో చూసినా ఈ బ్యాంకు పనిచేస్తోందన్నారు. ఏపీజీబీ బ్యాంకు కడప సరైన కేంద్రంగా రాష్ట్రస్థాయిలో సేవలందించగలుగుతుందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు, రైతాంగానికి, చిన్న పరిశ్రమలకు, చిన్న వ్యాపారాలకు సేవలందించే గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కూడా అలాంటి వాతావరణం (ఎకో సిస్టమ్) ఉన్న కడపలోనే ఉండడం న్యాయమన్నారు. ఈ దిశగా కేంద్ర ఆర్థిక శాఖ తక్షణం నిర్ణయం తీసుకోవాలని మిథున్ రెడ్డి లేఖలో కోరారు.